క్లుప్తంగా

105 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని జగ్గరాజుపాలెం, ఎన్ ఎస్ కండ్రిక, పెట్లూరు, వర్థినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 732 బేళ్లను వేలానికి తీసుకురాగా 627 బేళ్లు కొనుగోలు చేసి 105 బేళ్లను తిరస్కరించారు. పొగాకు కనిష్ఠ ధర కేజీ రూ.225, సరాసరి ధర కేజీ రూ.257.85గా నమోదైంది. వేలంలో 18 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280 పలికిందని వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు. క్లస్టర్ పరిధిలోని ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 715 బేళ్లను తీసుకురాగా 603 బేళ్లను కొనుగోలుచేసి 112 బేళ్లను తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.225, సరాసరి ధర రూ.264.84గా నమోదైంది. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు


తిమ్మారెడ్డిపల్లిలో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బారాయుడు అన్నారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాల రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సచివాలయ పరిధిలో అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రిపుల్‌ఐటీ కళాశాల స్థల పరిశీలన

పామూరు: మండలంలోని దూబగుంట్ల వద్ద గతంలో ట్రిపుల్ ఐటీకి కేటాయించి, భూమిపూజ చేసిన స్థలాన్ని గురువారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ భాస్కర్‌పటేల్, ఏఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన భూమిపూజ, మొత్తం స్థల వివరాలపై చర్చించారు. తహసీల్దార్ బీవీ రమణారావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్‌ఓ శ్రీనివాసులు, పువ్వాడి వెంకటేశ్వర్లు, మెంటా నరసింహారావు, పందిటి హరీష్, అమీర్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

కనిగిరిరూరల్: జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాశ్మీర్‌లో పర్యాటక ప్రాంతమైన పెహల్గాంలో సందర్శనకు వచ్చిన అమాయక పౌరులపై ఉగ్ర మూకలు దుశ్చర్యకు పాల్పడటం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం అందించి ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

124 మందికి ఉచిత వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సీఎస్‌పురం(పామూరు): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని వైద్యురాలు జి.నిఖితరాణి అన్నారు. మండలంలోని శీలం వారిపల్లెలో కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సర విద్యార్థుల జాతీయ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సాధారణ వ్యాధులకు 124 మందికి నిఖితరాణి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య, ఏఎన్ఎం రమాదేవి, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని కోవూరు రోడ్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనుల నిమిత్తం ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి 9 గంటల వరకు జనార్దన కాలనీలోని దుర్గమ్మగుడి ప్రాంతం, మగ్గాల మిల్లు ప్రాంతం, కేంద్రీయ విద్యాలయం, పాలిటెక్నిక్ కాలేజీ, ఉప్పుచెరువు, ఏకలవ్యనగర్, గడ్డంవారి కొస్టాలు, పువ్వాడివారి కొస్టాలు, బృందావనం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

విద్యుత్ కోతలు..ప్రజల వెతలు..

- తరచూ విద్యుత్ కోతలతో గ్రామీణుల ఇక్కట్లు
- వేసవిలో అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు
- లో ఓల్టేజ్ సమస్యతో తిరగని ఫ్యాన్లు, వెలగని బల్బులు


బాప్టిస్ట్ నగర్ సమీపంలో అధిక లోడుతో లో ఓల్టేజీకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్


విద్యుత్ కోతలతో అంధకారంలో గ్రామాలు


పొన్నలూరు విద్యుత్ సబ్ స్టేషన్

పొన్నలూరు:

మండలంలో తరచూ ద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈఎల్ఆర్, విద్యుత్ సాంకేతిక సమస్యలతో పాటు వివిధ కారణాలతో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపేవస్తున్నారు. రాత్రిళ్లు కూడా కోతలు ఎక్కువగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికార పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో వారి మాటలకు పొంతన ఉండటం లేదు. ఏ సమయంలో విద్యుత్ ఉంటుందో, ఉండదో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం, పైరెడ్డిపాలెం, ముప్పాళ్ల, శింగరబొట్లపాలెం, వెల్లటూరు, మంగపాతివారిపాలెం, ఉప్పలదిన్నె, వెంకుపాలెం, చెన్నిపాడు గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాల్లో వారం రోజులుగా ప్రతి రోజు ఎక్కువ సమయం విద్యుత్ సరఫరా ఉండటం లేదు. దీనిపై ఆ శాఖ అధికారులను అడిగితే సాంకేతిక సమస్యలని, మరో వైపు ఈఎల్ఆర్ పేరుతో కోతలు విధిస్తున్నారని చెబుతున్నారు.

స్తంభిస్తున్న వ్యాపారాలు, కార్యాలయాల పనులు

గంటల తరబడిగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాపారాలు ఎక్కడివక్కడే స్తంభించి పోతున్నాయి. గ్రామాల్లో విద్యుత్ కోతలతో తాగునీటి కోసం మంచినీటి వాటర్ ప్లాంట్లు దగ్గర మహిళలకు నిరీక్షణ తప్పడం లేదు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం కంప్యూటర్లు పనిచేయక పాలనాపరమైన సమస్యతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ కేంద్రాలు, ఇంటర్‌నెట్ షాపులు పనిచేయక అవసరమైన పలు రకాల పత్రాలు సకాలంలో అందడం లేదు.

రాత్రుల్లో దోమల బెడద...

ఇటీవల అడపాదడపా వర్షాలు పడతుండడంతో రాత్రిళ్లు కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో చిన్నారులుతో పాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వేసవి కాలం కావడంతో ఉక్కపోతతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రతి రోజు ఒక సమయమంటూ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అలాగే కరెంటు ఎప్పుడు వస్తుందో అని స్థానిక అధికారులను సంప్రదించినా స్పష్టమైన సమాచారం అందించే వారు లేకపోవడంతో ప్రజలు అయోమయంలో పడుతున్నారు.

లో ఓల్టేజీలో సమస్యతో అవస్థలు ...

మండలంలోని చాలా గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. లో ఓల్టేజ్ సమస్య ఉండటంతో ఇళ్లల్లో ఫ్యాన్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో వేసవి కావడంతో వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్న వారు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. పొన్నలూరు అంబేడ్కర్ నగర్, బాప్టిస్ట్ నగర్, సిద్ధార్ధ నగర్‌లోని గృహాలతో పాటు గ్రామంలోని మరికొన్ని ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకా నిత్యం లో ఓల్టేజీ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా ఈ మూడు కాలనీలో సుమారుగా 700 కుటుంబాల వారు నివాసముంటున్నారు. అయితే ఈ కాలనీలకు విద్యుత్ సరఫరా చేసే క్రమంలోఒకే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సప్లయ్ ఇస్తున్నారు. దీంతో అధిక లోడు ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండటంతో నిత్యం లో ఓల్టేజీ సమస్య తలెత్తుతుంది. మూడు కాలనీలతో పాటు గ్రామంలోని కొన్ని ఇళ్లల్లో నిత్యం విద్యుత్ సరఫరా ఉన్నా రాత్రి సమయంలో గృహాల్లోని బల్బులు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ గృహోపకరణాలు సరిగా పనిచేయడం లేదు. వాస్తవంగా కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఒక తీగకు మరొక తీగ తగలడం వలన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవున్నాయి. దీంతో ఆ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీనిపై సర్వసభ్య సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు ప్రస్తావించినా సమస్యలను పరిష్కరించడం లేదు. మొత్తంగా గత వారం రోజులుగా విద్యుత్ కోతలు సమయపాలన లేకుండా ఉండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నాం:



తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండటం,తో పనులు ఆగిపోయి అవస్థలు పడుతున్నాం. కరెంటు పోతే ఎక్కువ సమయం రావడం లేదు. రాత్రిళ్లు కూడా కోతలు ఉండటంతో దోమల బెడదతో అల్లాడిపోతున్నాం. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఉండదో తెలియని పరిస్థితి ఏర్పడింది. రాత్రిళ్లు కూడా సుమారుగా రెండు, మూడు గంటలు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పసిపిల్లలు, వృద్ధులు, ప్రజలు దోమల బెడదతో అల్లాడిపోతున్నారు. విద్యుత్ కోతలను నివారించాలి.

పల్లపోలు బాలకోటిరెడ్డి,
మాజీ సర్పంచ్, శింగబొట్లపాలెం

లో ఓల్టేజ్‌తో గృహోపకరణాలు పనిచేయడం లేదు:



పొన్నలూరు అంబేడ్కర్ నగర్, బాప్టిస్ట్ నగర్, సిద్ధార్ధ నగర్‌లో 700 కుటుంబాలు వారు నివాసముంటున్నారు. ఈ కాలనీలకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సప్లయ్ ఇస్తున్నారు. దీంతో అధిక లోడు ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండటంతో నిత్యం లో ఓల్టేజ్ సమస్య తలెత్తుతుంది. గృహాలకు విద్యుత్ సరఫరా ఉన్నా రాత్రిళ్లు లో ఓల్టేజ్‌తో బల్బులు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ గృహోపకరణాలు సరిగా పనిచేయడం లేదు. విద్యుత్ అధికారులకు విన్నవిస్తున్నా ఎవరూ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడం లేదు.

మంచికలపాటి సాల్మన్,
బాప్టిస్ట్ నగర్, పొన్నలూరు

ఉత్తమ సర్పంచ్‌లకు సన్మానం


ప్రశంసాపత్రం అందుకుంటున్న దూబగుంట్ల ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి


ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ ఖాదర్‌బీ బుజ్జి


అవార్డు అందుకుంటున్న దొడ్డిచింతల సర్పంచ్ బ్రహ్మారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): ఉత్తమ సర్పంచ్‌గా మండలంలోని కోవిలంపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పర్యాటకశాఖ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి, పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారిలు సర్పంచ్ ఖాదర్‌బీ బుజ్జికి ప్రసంశాపత్రం అందజేశారు.

హనుమంతునిపాడు:: ఉత్తమ సర్పంచ్‌గా దొడ్డిచింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు.

ఉత్తమ పంచాయతీగా దూబగుంట్ల

పామూరు: ఉత్తమ గ్రామ పంచాయతీగా మండలంలోని దూబగుంట్ల ఎన్నికయింది. ఈసందర్భంగా గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలు మల్లయ్య లింగస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన దూబగుంట్ల పంచాయతి ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి పర్యాటకశాఖ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి, ఒంగోలు నగర పంచాయతీ మేయర్ గంగాడ సుజాత, పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారిల చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దద్దాల


వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులపై జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడారు.

ఉపేంద్ర చౌదరిని పరామర్శించిన ఆదిమూలపు


ఉపేంద్ర చౌదరిని పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: కొండపి మాజీ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బొక్కిసం ఉపేంద్ర చౌదరి అనారోగ్యంతో చెన్నై వైద్యశాలలో చికిత్స తీసుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కట్టవారిపాలెంలోని ఉపేంద్ర చౌదరి గృహానికి గురువారం వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య విషయాలపై వివరాలు తెలుసుకొని, భరోసా కల్పించారు. తొందరలో కోలుకొని పార్టీలో కీలకంగా పని చేయాలని ఉపేంద్రకు సురేష్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, స్టేట్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ రియాజ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సుల్తాన్, వైస్ ఎంపీపీ కోటరాజు, ఇంటలెక్చువల్ నియోజకవర్గ అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు వసంతరావు, యువజన విభాగం అధ్యక్షుడు గంగాధర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్క కిరణ్, నియోజవర్గ సీనియర్ నాయకులు, బొక్కిసం సుబ్బారావు, మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, దివి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


అధికారులను సత్కరిస్తున్న సిబ్బంది

- ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

కందుకూరు రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా పల్లె ప్రగతి దేశానికి ప్రగతి అని ప్రజాస్వామ్య చరిత్రలో పంచాయతీలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంపీపీ ఇంటూరి సుశీల, జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్యలు కేక్ కట్ చేసి పంచాయతీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యాలయంలోని అధికారులకు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటూరి మాధవరావు, టి.శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతి ఫలితాల్లో సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 82 శాతంతో సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల స్థాయిలో ప్రథమస్థానం పొందిన భవనాసి సహస్రను అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ పీయంశ్రీ పథకంకింద తమ పాఠశాలలో అనేక ప్రత్యేక కోర్సులు ఉన్నాయని రానున్న విద్యాసంవత్సరంలో తమ పాఠశాలలో అడ్మిషన్లు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ షేక్.హుస్సేన్‌బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌ల బహూకరణ


మైక్‌లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు రూరల్: పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1973–74 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు మైక్‌లు బహూకరించారు. రూ. 25 వేలు విలువ చేసే అహుజా కంపెనీ లేటెస్ట్ మోడల్ అఫ్లిఫైర్, కార్డు లెస్ మైక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.నరసింహమూర్తి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు సహాయం చేయడం మంచి పరిణామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, పరుగు ప్రసాద్, గుడ్లూరి వెంకటేశ్వరరావు, ఇప్పగుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు సరస్వతి, పూర్వ విద్యార్థులు మంచిరాజు మురళీ, దొనవల్లి రమేష్, ఎస్‌కే. సందాని బాషా, ముచ్చెలి ఉమామహేశ్వరరావు, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, గోనుగుంట సుబ్రహ్మణ్యం, ఉరిమి వెంకట సుబ్బారావు, ఏకాంబరం సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు గడువు పొడిగింపు

లింగసముద్రం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షెడ్యూల్ కులవారికి సబ్సిడీతో కూడిన రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మే 13వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్లై చేసుకునే లబంధిదారుల వయసు 21 సంవత్సరాల నుంచి 50 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులు. ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువపతరాలు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ నెంబర్ లింకయిన ఫోన్ నంబర్‌ను తీసుకుని సమీపంలో గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆన్‌లైన్ చేయించాలన్నారు. అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు.

తడి, పొడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారీ


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్

లింగసముద్రం: గ్రామాల్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుల్లో వర్మీకంపోస్టు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి కే కృష్ణమోహన్ చెప్పారు. గురువారం మండలంలోని పెదపవని, చినపవని గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికి తడి, పొడి చెత్తను సేకరించే విధానాన్ని, చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. పెదపవనిలో సంపద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపును పరిశీలించారు. అనంతరం క్లాప్ మిత్రలకు, పంచాయతీ కార్యదర్శులకు కృష్ణమోహన్ చెత్త సేకరణ గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దామా సీతారామయ్య పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ క్యాండిల్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

పామూరు: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండల కేంద్రమైన పామూరులో క్యాండిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మనోహర్, పందిటి హరీష్ మాట్లాడుతు పర్యాటకులపై దాడి చేసి వారి మృతికి కారకులైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. దరశి రాజేష్, మెంటా నరసింహారావు, మంచికంటి మధు, దరిశి మస్తాన్‌రావు, తడికమళ్ల హరి, పాబోలు శివ పలవురు పాల్గొన్నారు.